క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి వినతి



మంత్రి పొంగులేటికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కందుకూరు: టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి ఆధ్వర్యంలో గురువారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్థానికంగా నెలకొన్న సమస్యల పరిష్కారానికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు అందుగుల సత్యనారాయణ, మదన్‌పాల్‌రెడ్డి, శ్రీశైలం, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో ఆత్మసంతృప్తి



విద్యార్థులకు డిక్షనరీలు అందిస్తున్న వెంకటేశ్వర్లుగుప్తా తదితరులు

కందుకూరు: సమాజ సేవలో ఆత్మసంతృప్తి ఉందని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీధర్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కుంచకూరి వెంకటేశ్వర్లుగుప్తా గురువారం నేదునూరులోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు డిక్షనరీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివే పేద విద్యార్థులకు చేయూతనందించే దాతలు ముందుకు రావాలని కోరారు. వెంకటేశ్వర్లుగుప్తా మాట్లాడుతూ.. ప్రతి ఏడాది తన తండ్రి జనార్దన్‌గుప్తా జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానన్నారు. కార్యక్రమంలో యాదయ్యగుప్తా, సత్యనారాయణగుప్తా, పాఠశాల యాజమాన్యం, హరీశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

మీర్‌పేట: చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం 33/11కేవీ నందనవనం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని మీర్‌పేట ఏఈ ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మీర్‌పేట మున్సిపల్ కార్యాలయ పరిసర కాలనీలు, జిల్లెలగూడ పాత గ్రామ పంచాయతీ, జనార్దన్‌రెడ్డినగర్, గాయత్రినగర్, ఆర్‌ఎన్‌రెడ్డి నగర్, లలితానగర్, వాంబేకాలనీ, జయశ్రీ కాలనీ, టీఆర్‌ఆర్ టౌన్‌షిప్, నందనవనం పరిసర కాలనీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌ను నిలిపి వేయనున్నారు.

సరూర్‌నగర్ పరిధిలో..

హుడాకాంప్లెక్స్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు కాలనీలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ శివయపురికాలనీ, పోస్టాఫీసు ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు. 11కేవీ అలకాపురి కాలనీ, భగత్‌సింగ్‌నగర్, ఖిల్లా మైసమ్మ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాలలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు. 11కేవీ గొటేటి ఫంక్షన్‌హాల్, వీ-గార్డ్, శ్రీనివాసకాలనీ, రాక్‌హిల్స్ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్‌ను నిలిపి వేయనున్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులకు అభినందన



శుభాకాంక్షలు తెలుపుతున్న రవికుమార్

పహాడీషరీఫ్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహేష్ కుమార్ గౌడ్, బల్మూరి వెంకట్‌లు ఎమ్మెల్సీ స్థానాల కోసం నామినేషన్ వేసిన సందర్భంగా పార్టీ రంగారెడ్డి జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మస్న రవికుమార్ ఆధ్వర్యంలో శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు గూడూరు శ్రీనివాస్, వరలక్ష్మి, రమేశ్, అశోక్, నరేందర్, సత్యసాయి, రాజు, కర్నాటి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 19, వంకాయ 23, బెండ 35, పచ్చిమిర్చి 50, కాకర 55, బీర 40, క్యాబేజీ 19, క్యారెట్ 40, దొండ 23-35, చిక్కుడు 23-40, గోకర 45, బీట్‌రూట్ 19, క్యాప్సికం 55, ఆలు 18-23, దోస 28, సొర 9 ఉల్లిగడ్డ 24 ధరలు శుక్రవారం ఉదయం వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

అభివృద్ధి పేరిట రోడ్ల ధ్వంసం

- పైప్‌లైన్ వేసేందుకు ఇష్టారాజ్యంగా తవ్వకాలు
- పని పూర్తయ్యాక మట్టిపోసి వదిలేసిన కాంట్రాక్టర్
- ప్యాచ్‌వర్క్ చేయకపోవడంతో రాకపోకలకు ప్రజల అవస్థలు



చైతన్యపురి డివిజన్ విద్యుత్‌నగర్‌లో అధ్వానంగా మారిన రహదారులు

చైతన్యపురి: అద్దంలా ఉన్న రోడ్లను అభివృద్ధి పనుల పేరిట అధికారులు కాంట్రాక్టర్లతో తవ్విపోయిస్తున్నారు. పనులు పూర్తయ్యాక వాటికి ప్యాచ్ వర్క్‌లు చేయడం లేదు. అధ్వానంగా మారిన రోడ్లపై రాకపోకలకు జనం ఇబ్బందులు పడుతున్నారు. చైతన్యపురి డివిజన్ విద్యుత్‌నగర్‌లోని రోడ్ల పరిస్థితే ఇందుకు నిదర్శనం. అధికారుల పట్టించుకోకపోవడం వల్లే కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు కలుగజేసుకొని తమ కాలనీ రోడ్లకు మరమ్మతు చేయించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

- తాగునీటి పైప్‌లైన్ వేసేందుకు చైతన్యపురి డివిజన్ విద్యుత్‌నగర్‌లోని రహదారులను ఆరు నెలల క్రితం తవ్వారు. పైప్‌లైన్ వేసిన కాంట్రాక్టర్ దానిపై మట్టిని కుప్పలుగా పోసి చేతులు దులుపుకున్నాడు.
- మట్టిని పోసి చదును చేయడంతో పాటు ప్యాచ్ వర్క్ చేయాల్సి ఉండగా అలాగే వదిలేశాడు.
- ఆ రోడ్లపై వాహనాలు వెళ్లడంతో అస్తవ్యస్తంగా మారింది. అక్కడ గుంతలు ఏర్పడి పాదచారులు, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి.
- తాగునీటి సరఫరా మెరుగు పర్చేందుకు కొత్త పైప్‌లైన్లు వేయడం బాగున్నప్పటికీ, రోడ్లను తవ్వి మరమ్మతు చేపట్టడంలో మాత్రం అధికారులు విఫలమవుతున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు.
- అభివృద్ధి పనులు జరుగుతున్నప్పుడు సంబంధిత అధికారుల పర్యవేక్షణ ఉండటం లేదని. కాంట్రాక్టర్‌తో సక్రమంగా పనులు చేయించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోందని వారు అంటున్నారు.
- పైప్‌లైన్ వేసి ఆరు నెలలు కావస్తున్నా.. జలమండలి అధికారులు ఇంటింటికీ కనెక్షన్ మాత్రం ఇవ్వలేదని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదంటున్నారు.
- ఇప్పటికైనా జలమండలి ఉన్నతాధికారులు స్పందించి తమ కాలనీలో ఇంటింటికీ తాగునీటి కనెక్షన్లు ఇప్పించడంతో పాటు రహదారులకు ప్యాచ్ వర్క్ పూర్తి చేయించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని విద్యుత్‌నగర్ వాసులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా...



ఆరు నెలల క్రితం విద్యుత్‌నగర్ కాలనీలో రోడ్లు తవ్వి తాగునీటి పైప్‌లైన్ వేశారు. ఇంటింటికీ కనెక్షన్ ఇవ్వడంలో ఆలస్యమైనందున రోడ్డుకు ప్యాచ్‌వర్క్ చేపట్టలేదు. పైప్‌లైన్ వేయడంతో పాటు ఇంటింటికీ కనెక్షన్లు ఇవ్వాల్సిన బాధ్యత ఈ పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌దే. కాంట్రాక్టర్ రాకపోవటం వల్ల రోడ్లకు ప్యాచ్ వర్క్ జరగలేదు. జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరగా పనులు పూర్తయ్యేలా చూస్తా.

– రంగా నర్సింహగుప్తా, కార్పొరేటర్, చైతన్యపురి డివిజన్

అందరికీ సంక్షేమ ఫలాలు



వికసిత్ భారత్ సంకల్ప యాత్ర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సర్పంచ్ తదితరులు

- కొత్తగూడలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

కందుకూరు: భారతదేశాన్ని 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే సంకల్పంతో ప్రధాని నరేంద్ర మోదీ పని చేస్తున్నారని కొత్తగూడ సర్పంచ్ సాధ మల్లారెడ్డి తెలిపారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా గురువారం మండల పరిధిలోని కొత్తగూడలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు తెలిపేలా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యాత్రకు సంబంధించిన నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. దేశంలో పేదరిక నిర్మూలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం పని చేస్తుండటం గర్వించదగ్గ విషయమన్నారు. సంక్షేమ ఫలాలు అందరికీ చేరాలన్న లక్ష్యంతో మోదీ ప్రభుత్వం పాలన కొనసాగిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అశోక్‌గౌడ్, వైద్య, వ్యవసాయ శాఖ అధికారులు రవీందర్, రాజు, పంచాయతీ కార్యదర్శి శివశంకర్ వార్డు సభ్యులు హన్మంత్‌రెడ్డి, అజీజ్‌ఖాన్, నాయకులు సత్యనారాయణరెడ్డి, లోకేశ్వర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, అంజయ్య, కృష్ణయ్య, సుధాకర్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, బస్వారెడ్డి, జంగారెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి



విలేకరులతో మాట్లాడుతున్న ఎంఆర్‌పీఎస్ (టీఎస్) నేతలు

మన్సూరాబాద్: గత 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా పోరాటాలు చేస్తున్నామని, రానున్న పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని ఎంఆర్‌పీఎస్ (టీఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి జీడీ నర్సింహ మాదిగ డిమాండ్ చేశారు. ఎల్‌బీనగర్‌లోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ తీసుకుని ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణకు అఖిలపక్షాన్ని కేంద్రం ప్రభుత్వం వద్దకు తీసుకెళ్లాలని కోరారు. గత ప్రభుత్వంలో దళిత బంధుకు ఎంపికైన వారందరికీ ఆ పథకాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. మాదిగ ఉపకులాలకు, మాదిగ ఎమ్మెల్యేకు సముచిత స్థానం కల్పించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు సక్రమంగా వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ (టీఎస్) జాతీయ మహిళ అధ్యక్షురాలు ఆకారపు రుక్కమ్మ, కోర్ కమిటీ నాయకులు చిన్నగల యాదయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు వేముల సూర్య ప్రకాష్, పసుపుల హరిబాబు, చింతకుంట్ల రామస్వామి, సైదులు, ధనలక్ష్మి, యాదమ్మ పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం



దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సీఐ

మాడ్గుల: స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయమని మాడ్గుల సీఐ రాజశేఖర్ అన్నారు. సేవా భావంతో వారు చేసే సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మాడ్గుల మండలం కలకొండలో గురువారం సర్వ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు సేవా కార్యక్రమాల్లో సీఐ రాజశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు దుప్పట్లు, ఉచిత బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. అనంతరం హైదరాబాద్ కామినేని ఆస్పత్రి ఆధ్వర్యంలో ప్రజలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థలు ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్వ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ అనిల్‌కుమార్, అధ్యక్షురాలు మీనాక్షి, సర్పంచ్ రవీందర్‌రెడ్డి, జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు బొడ్డు శంకర్, సర్వ్ సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్, ధనలక్ష్మి, సురేశ్, ఆర్టీసీ సిబ్బంది శ్రీరాములు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

108లో ఉద్యోగ అవకాశాలు

వనస్థలిపురం: 108 సంస్థ – ఈఎంఆర్‌ఐ-హెచ్‌ఈఆర్‌ఎస్‌ఎఫ్‌లో పైలెట్లు, ఈఎంటీఎస్‌గా రంగారెడ్డి జిల్లాలో పని చేయడానికి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ వసంత్, జిల్లా కో ఆర్డినేటర్ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈఎంటీకి బీఎస్సీ (లైఫ్ సైన్స్), ఎంఎల్‌టీ అండ్ డీఎంఎల్‌టీ, బీ ఫార్మాలో ఉత్తీర్ణత గలవారు అర్హులన్నారు. పైలెట్ కోసం ఎస్‌ఎస్‌సీ ఉత్తీర్ణతతో పాటు బ్యాడ్జి లైసెన్స్ ఉండాలన్నారు. ఇతర వివరాలకు ఫోన్ నం. 9154248992 లో సంప్రదించాలని వారు కోరారు.

దళిత్ క్రిస్టియన్ దండోరా కో కన్వీనర్‌గా ఇర్మియా

మలక్‌పేట: దళిత్ క్రిస్టియన్ దండోరా తెలంగాణ రాష్ట్ర కో కన్వీనర్‌గా మలక్‌పేటకు చెందిన కూనదొడ్డి ఇర్మియా నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ కన్వీనర్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని యిర్మీయా అన్నారు. దేశ జనాభాలో 30 శాతం ఉన్న దళితులు, దళిత క్రైస్తవులు అణిచివేతకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దళితులు, దళిత క్రైస్తవులపై దాడులు జరుగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారన్నారు. దళితులు, దళిత క్రైస్తవుల రాజకీయంగా బలపడం కోసం, వారి అభివృద్ధే లక్ష్యంగా ఉద్యమిస్తామన్నారు.

నిర్మాణ వ్యర్థాలు నిర్ణీత ప్రాంతాల్లోనే వేయాలి

లింగోజీగూడ: నిర్ణీత ప్రాంతాల్లోనే నిర్మాణ వ్యర్థాలను వేయాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ పంకజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు నిర్మాణ వ్యర్థాల డంపింగ్ కోసం ఎల్‌బీ నగర్ జోనల్ పరిధిలో పలు ప్రాంతాలను నిర్ణయించామన్నారు. ఇతర ప్రాంతాలలో, రోడ్లపై నిర్మాణ వ్యర్థాలను, కూల్చివేసిన భవన వ్యర్థాలను ప్రైవేట్ ట్రక్కుల యజమానులు తెచ్చి వేస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. యూజర్ చార్జీలు చెల్లించకుండా రోడ్లపై వేసేవారిపై చర్యలు తీసుకోవాలని ఇప్పటికే సర్కిళ్ల డీసీలకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలో వ్యర్థాలను డంపింగ్ చేయడానికి కాప్రా సర్కిల్‌లోని సాకేత్ డంపింగ్ పాయింట్, ఉప్పల్ సర్కిల్ పరిధిలో దేవేందర్ నగర్ డంపింగ్ పాయింట్, హయత్‌నగర్ సర్కిల్ పరిధిలోని జీఎస్‌ఐ రోడ్డు డంపింగ్‌కు కేటాయించామన్నారు. నిర్ణయించిన ప్రాంతాల్లో తప్ప ఇతర ప్రాంతాల్లో వ్యర్థాలు వెయ్యరాదని కమిషన్ పంకజ పేర్కొన్నారు.

టెట్ అర్హత నుంచి మినహాయింపు ఇవ్వాలి

చాదర్‌ఘాట్: తెలంగాణ రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎస్.వి జయభాస్కర్ విద్యాశాఖ అధికారులను కోరారు. గురువారం ఆయన మలక్‌పేటలో విలేకరులతో మాట్లాడుతూ, 50 ఏళ్లు పైబడిన వారికి ఎలాంటి డిపార్ట్‌మెంట్ పరీక్షలు ఉత్తీర్ణత సాధించకున్నా పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయన్నారు. 25 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసిన ఉపాధ్యాయులు, రేపోమాపో పదవీ విరమణ చేయబోతూ కనీసం ఒక పదోన్నతి అయినా తీసుకుందామనుకునే వారికి టెట్ అర్హత ఉండాలని చెప్పడం ఆందోళన కలిగిస్తోందన్నారు. తెలంగాణ ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు టెట్ అర్హత నుంచి సీనియర్ ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని ఆయన కోరారు.

గ్యారంటీలు చేరువయ్యేలా కృషి

- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రాచారి



కృష్ణకు సభ్యత్వాన్ని అందజేస్తున్న రవీంద్రాచారి

హుడాకాంప్లెక్స్: సీపీఐ భగత్‌సింగ్‌నగర్ నూతన ఫేజ్-1 శంకర్‌నగర్ శాఖ సమావేశం గురువారం పార్టీ నేతలు నిర్వహించారు. కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రాచారి హాజరై సభ్యులకు పార్టీ సభ్యత్వాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గతంలో భగత్‌సింగ్‌నగర్ స్థాపించింది సీపీఐ పార్టీయేనని, ఎన్నో పోరాటాల ఫలితంగా ఆనాడు అజీజ్‌పాషా నాయకత్వంలో బస్తీని ఏర్పాటు చేశామన్నారు. నాటి నుంచి నేటి వరకు స్థానిక సమస్యలపై సీపీఐ నిరంతరం పోరాడుతుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలపైన కూడా కార్యకర్తలు దృష్టి సారించి అర్హులైన ప్రతి పేదవారికి అందేలా చూడాలన్నారు. సభ్యత్వాన్ని ఈ నెల 31 లోపు పూర్తి చేసి జిల్లా పార్టీకి అందజేయాలన్నారు. ఈ సందర్భంగా శంకర్‌నగర్ శాఖ నూతన అధ్యక్షుడుగా జిల్లా కృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కన్వీనర్ నరసింహ, ఇద్రీస్ బాయ్, శ్యామల, భాగ్యమ్మ, రమణమ్మ, ఖాదర్, కిషన్, యూసుఫ్, జోసెఫ్, లావణ్య పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు అవకాశం

- ఆర్డీఓ సూరజ్‌కుమార్



మాట్లాడుతున్న ఆర్డీఓ సూరజ్‌కుమార్ పక్కన తహసీల్దార్ గోపాల్

కందుకూరు: ఓటరుగా 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ పేరును నమోదు చేయించుకోవాలని ఆర్డీఓ సూరజ్‌కుమార్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జనవరి 6 నుంచి 22 వరకు శని, ఆదివారాల్లో సైతం ఓటు హక్కు నమోదు చేసుకునేలా ఆయా గ్రామాల్లోని పోలింగ్ బూత్‌ల వద్ద బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారన్నారు. ఫారం-6 ద్వారా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని, ఫారం-7 ద్వారా తొలగింపు ఉంటుందన్నారు. ఫారం-8 ద్వారా తప్పొప్పులు సరిచేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్ ద్వారా కూడా ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం కల్పించామన్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 5,55,141 మంది ఓటర్లు ఉన్నారన్నారు. 541 బూత్‌లలో 18 ఏళ్లు నిండిన వారు 3 శాతం కొత్తగా నమోదు చేసుకోవాల్సి ఉండగా ఇప్పటి వరకు 2.6 శాతం మాత్రమే నమోదయిందన్నారు. సీనియర్ సిటిజన్లు 8,288, దివ్యాంగులు 8,350 మంది ఉన్నారన్నారు. ఓటరు నమోదుకు అందరూ సహకరించాలని కోరారు. ఆయన వెంట తహసీల్దార్ గోపాల్ పాల్గొన్నారు.

మైనార్టీ గురుకుల కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ బి.సురేందర్‌రెడ్డి

హస్తినాపురం: ప్రభుత్వ మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాల హెచ్‌ఈసీ, సీఈసీ గ్రూపుల విద్యార్థులు గతేడాది అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారని నందనవనంలోని ప్రభుత్వ మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.సురేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులను జానిమియా ఆర్‌ఎల్‌సీ-1, చాంద్రాయణగుట్ట బాలురు-1 ఆన్‌లైన్‌లో ఈనెల 18 నుంచి వచ్చే నెల ఫిబ్రవరి 6 వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జూనియర్ కళాశాలలో మంచి హాస్టల్ సౌకర్యంతో పాటు క్రీడలు, యూనిఫారం, షూలు, పాఠ్యపుస్తకాలు , నోట్ పుస్తకాలు ప్రతి ఒక్కరికి అందజేస్తామన్నారు. మైనార్టీ విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

జూబ్లీహిల్స్ బాలురు-1 మైనార్టీ గురుకుల పాఠశాలలో ...

హస్తినాపురం డివిజన్ పరిధిలోని నందనవం కాలనీలోని జూబ్లీహిల్స్ బాలురు-1 ప్రభుత్వ మైనార్టీ గురుకుల పాఠశాలలో 2024-25 సంవత్సరానికి 5 వతరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ ప్రకాశ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, జూబ్లీహిల్స్ బాలుర-1 మైనార్టీ గురుకుల పాఠశాలలో 6,7,8 తరగతుల్లో చేరేందుకు మైనార్టీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. జనవరి 18 నుంచి ఫిబ్రవరి 6 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

బాలానగర్ బాలికల గురుకుల కళాశాలలో ..

మన్సూరాబాద్: బాలానగర్ బాలికల మైనార్టీ గురుకుల కళాశాల 2024-25 విద్యాసంవత్సర ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి. వినీల ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ సీఈసీ, హెచ్‌ఈసీ కోర్సుల్లో ప్రవేశానికి మైనార్టీ, నాన్ మైనార్టీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 18 నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుందన్నారు. మరిన్ని వివరాలకు ఎల్‌బీనగర్ సూర్యోదయనగర్‌లోని కళాశాలలో లేదా 9154365042, 9160255040 ఫోన్ నంబర్ల ద్వారా సంప్రదించాలన్నారు.

ధ్యానాంజనేయ స్వామి సేవలో ఎమ్మెల్యే కసిరెడ్డి



ఎమ్మెల్యే నారాయణరెడ్డిని సన్మానిస్తున్న నల్లా రఘుమారెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామివారి ఆలయానికి గురువారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దంపతులు హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు వారిని ఆలయ పాలక మండలి చైర్మన్ నల్లా రఘుమారెడ్డి, సభ్యులు ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. అనంతరం ఆలయ పూజారులు వేద మంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

అయోధ్య అక్షితల ఊరేగింపు

కడ్తాల్: మండలంలోని రావిచేడ్‌లో అయోధ్య రామమందిరం దివ్య అక్షితలను గురువారం గ్రామస్తులు ఊరేగింపు చేసి, ఇంటింటికీ పంపిణీ చేశారు. స్థానిక ఆలయంలో అక్షితలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనవరి 22న అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ అక్షితలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ భారతమ్మ, ఎంపీటీసీ గోపాల్, నాయకులు విఠలయ్యగౌడ్, ప్రజాప్రతినిధులు, శ్రీరామ భక్తులు, హనుమాన్ భక్తులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చర్చి అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

- ఎస్సీఆర్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహ

తలకొండపల్లి: ఎలాంటి అనుమతులు లేకుండా, అక్రమంగా చర్చి నిర్మాణం చేపట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సీఆర్‌పీఎస్(ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పల నర్సింహ డిమాండ్ చేశారు. క్రైస్తవులుగా మారి,అక్రమంగా ఎస్సీ రిజర్వేషన్లు పొందుతున్న వారిపై చట్టరీత్యా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీకాంత్‌ను, రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ రంగారెడ్డిలను కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ.. మండలంలోని గట్టుఇప్పలపల్లిలో ఎలాంటి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా చర్చి నిర్మాణం చేపట్టారు. క్రైస్తవులుగా మారి అక్రమంగా ఎస్సీ రిజర్వేషన్లు పొందుతున్న వారిని గుర్తించి బీసీ సర్టిఫికెట్ మంజూరు చేయాలని తహసీల్దార్‌కు విన్నవించారు. చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వినోద్, అసెంబ్లీ ఇన్‌చార్జి కృష్ణ, మల్లేశ్, రాజు, గణేశ్, మహేశ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.